రేపల్లె పట్టణంలో అభివృద్ధి కాంతులు

- డివిజన్ కేంద్రంగా ఆవిర్భావంతో మారిన పట్టణ రూపురేఖలు
- స్థానిక ప్రజా ప్రతినిధుల కృషితో అపరిష్కృత సమస్యలకు పరిష్కారం
- అంబేడ్కర్ భవన నిర్మాణంతో సాకారమైన దళిత బహుజనుల చిరకాల స్వప్నం





ఓల్డ్‌టౌన్‌లో నూతనంగా నిర్మితమైన ప్రధాన రహదారి

రేపల్లె రూరల్: సంక్షేమం, అభివృద్ధి ప్రధాన అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో రేపల్లె పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. పాలనా వికేంద్రీకరణలో భాగంగా బాపట్ల జిల్లా ఏర్పాటుతో పాటు రేపల్లెను రెవెన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ఎంపిక చేయడంతో పట్టణానికి మహర్దశ పట్టింది. గత ప్రభుత్వాలలో నిరాదరణకు గురైన రేపల్లె తీర ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఎంపిక చేయాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అడిగిందే తడవుగా రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని 9 మండలాలను కలిపి రేపల్లె రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పడటం, డివిజన్ స్థాయికి సంబంధించిన పలు ప్రభుత్వ కార్యాలయాలు రావటంతో వివిధ మండలాల నుంచి రేపల్లె పట్టణానికి వివిధ పనులపై వచ్చే ప్రజల తాకిడి అనూహ్యంగా పెరిగింది. దీంతో ప్రభుత్వం రేపల్లె పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. దీంతో పట్టణంలో సుదీర్ఘ కాల సమస్యలతో పాటు పలు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

గోల్డ్‌టౌన్‌గా రూపుదిద్దుకుంటున్న ఓల్డ్ టౌన్

సమస్యలకు ఆలవాలంగా ఉన్నటువంటి ఓల్డ్‌టౌన్ అభివృద్ధి చెందుతూ క్రమంగా గోల్డ్‌టౌన్‌గా రూపాంతరం చెందుతోంది. ప్రధానంగా ఇరుకు రోడ్లను విస్తరింపజేయటంతో పాటు గుంతలమయంగా ఉన్నటువంటి రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రహదారి విస్తరణ చేసేందుకు ఆ ప్రాంతంలో కొంత మంది సుముఖత చూపకపోవటంతో సమస్య రోజు రోజుకు తీవ్రతరం దాల్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ఈ సమస్యను సవాలుగా తీసుకొని రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. సమస్యను అధిగమించి ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.2.25 కోట్లు కేటాయించి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ 60 అడుగుల వెడల్పుతో ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఆ రహదారి చూపరులను ఆకట్టుకుంటోంది. దీంతో ట్రాఫిక్ సమస్య సమసిపోగా రహదారి పనులు విస్తరించేందుకు అడ్డుపడినవారే నేడు భేష్ అని అంటుండటం విశేషం.

అపర కర్మలకు రాణిసత్రం

అద్దె గృహాలలో నివాసం ఉండేవారు తమ పెద్దలకు అద్దె గృహాలలో అపర కర్మలు చేసుకునేందుకు ఇంటి యజమానుల నుంచి ఆటంకాలు ఏర్పడేవి. గతంలో రాణి సత్రంలో పురపాలక సంఘానికి నామ మాత్రపు రుసుము చెల్లించి కర్మలు ఇక్కడే చేసుకునే వారు. శిథిలావస్థకు చేరిన రాణిసత్రంను కూల్చివేసిన తరువాత దాని నిర్మాణం సంవత్సరాలుగా ప్రశ్నార్థకంగా మిగిలింది. దీంతో రాజ్య సభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చొరవచూపి సత్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేసి రూ.40 లక్షలతో రాణిసత్రం నిర్మించడంతో పాటు దీని అనుసంధానంగా షాపింగ్ కాంప్లెక్స్‌ను పూర్తిచేశారు.

రైతుల కోసం రైతు బజార్

డివిజన్ పరిధిలోని రేపల్లెతో పాటు కొల్లూరు, భట్టిప్రోలులోని కొన్ని లంక గ్రామాలలో కూరగాయలతో పాటు అరటి, సపోటా, జామ, మామిడి తది తర పంటలను రైతులు సాగు చేస్తుంటారు. రైతులు పండించిన పంట విక్రయాలు దళారీ వ్యవస్థ కారణంగా గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పాలవుతున్న సమస్య నెలకొంది. రైతు బజారు ఏర్పాటు చేస్తే ఈ సమస్యకు చరమగీతం పలకవచ్చునని భా వించారు. రైతులు స్వయంగా తాము పండించిన పంట వారే విక్రయించుకుంటే గిట్టుబాటు ధర పొందుతారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు లభిస్తాయి. దీంతో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చొరవతో పట్టణంలో పాత పండ్ల మార్కెట్‌లో రూ.1.10 కోట్ల వ్యయంతో రైతు బజారు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రైతు బజారు నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



పట్టణంలో ఆకర్షణగా నిలుస్తున్న అంబేడ్కర్ పార్కు

దళిత బహుజనుల చిరకాల స్వప్నం అంబేడ్కర్ భవనం

దళిత బహుజనులకు 30 ఏళ్ల నుంచి కలగా మిగిలిన అంబేడ్కర్ భవన నిర్మాణం పూర్తి కావస్తుంది. పట్టణ నడిబొడ్డులో అంబేడ్కర్ భవన నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేయూతనిచ్చింది. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.1.15 కోట్ల నిధులతో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునతో కలిసి శంకుస్థాపన చేసి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ యుద్ధ ప్రాతిపదికన భవన నిర్మాణం పనులు నిర్వహిస్తున్నారు. పనులను నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్‌తో కలిసి ఆయన నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. త్వరలో దీనిని తీర ప్రాంత దళిత బహుజనులకు కానుకగా అందించనున్నట్లు ఎంపీ మోపిదేవి ఇటీవల పేర్కొన్నారు.

కళకళలాడుతున్న అంబేడ్కర్ పార్కు

కోవిడ్‌తో పట్టణంలో మూతబడిన అంబేడ్కర్ పార్క్‌ను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చొరవతో రూ.20 లక్షలతో పునర్నిర్మాణం గావించారు. పార్కులో అవసరమైన మౌలిక సదుపాయాలు, కొలను, అక్వేరియం ఏర్పాటుతో ప్రజలను ముఖ్యంగా చిన్నారులను ఆకర్షిస్తోంది.

రహదారి విస్తరణ భేష్



రేపల్లె మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి జటిల సమస్యగా ఉన్న ఓల్డ్‌టౌన్ రహదారి విస్తరణను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిష్కరించటం అభినందనీయం. విస్తరణను తొలుత వ్యతిరేకించినవారే నేడు స్వాగతిస్తున్నారు. ఓల్డ్‌టౌన్ గోల్డ్‌టౌన్‌గా రూపుదిద్దుకుంటుందని అనడానికి నిదర్శనంగా నాణ్యతతో నిర్మించబడిన రహదారి, సెంట్రల్ లైటింగ్‌లు నిలుస్తున్నాయి. అదేవిధంగా అద్దె గృహాలలో ఉండేవారికి రాణిసత్రం ఎంతగానో ఉపయోగంగా ఉంది.

– బొలిశెట్టి రవికుమార్, మందుల దుకాణాదారుడు, ఓల్డ్‌టౌన్.

కల నెరవేరుతోంది



దళిత బహుజనుల సుదీర్ఘ కల నెరవేరటం ఎంతో ఆనందంగా ఉంది. దళిత బహుజనుల ఐక్యత చాటు కోవటంతో పాటు సమావేశాల నిర్వహణ, చిన్నపాటి కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు పట్టణంలో ఓ వేదిక కావాలని 30 ఏళ్లుగా పలువురు ప్రజా ప్రతినిధులను కోరాము. ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారం కాలేదు. నేడు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను సీఎం జగనన్నకు విన్నవించి పట్టణ నడిబొడ్డున రూ.1.15 కోట్లతో అంబేడ్కర్ భవనం నిర్మింస్తుండటం కలలో కూడా ఊహించని అద్భుతం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ మోపిదేవి వెంకట రమణారావుకు రుణపడి ఉంటాం.

– గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్.

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



వేమూరు: ఉపాధి పథకం ద్వారా కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని ఎంపీడీవో జీవీఎస్‌వీ శేషగిరిరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం పర్యవేక్షించి మస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ప్రభుత్వం నిబంధనల ప్రకారం పని చేస్తే రోజు వారీ వేతనం రూ. 272లు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఏప్రిల్, మే నెలల్లో కూలీలు ఉదయం 6 గంటలకు పని ప్రదేశానికి వెళ్లి, 11 గంటలకు పనులు పూర్తి చేయాలని సూచించారు.

విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలకృష్ణమూర్తి



బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే ఆంగ్ల భాషపై పట్టు సాధించడంతో పాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈ.గోపాలకృష్ణమూర్తి సూచించారు. బెంగుళూరుకు చెందిన ఉన్నతి సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల నుంచి జరుగుతున్న యునెక్స్ శిక్షణా కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత నైపుణ్యాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేంజ్ మేకర్ రామకృష్ణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష ద్వారా ఉచిత వైద్య పరీక్షలు



కొల్లూరు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అధిక సంఖ్యలో రోగులు శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సచివాలయం–1 పరిధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 402 మంది రోగులకు ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కంటి చూపుతో ఇబ్బంది పడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి బి. మల్లికార్జున పర్యవేక్షించారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి



కొల్లూరు : ఓటర్లు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించు కోవాలని కొల్లూరు ఎస్‌ఐ రవీంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన పెసర్లంక, రావికంపాడు గ్రామాల్లో బీఎస్ఎఫ్ సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా గ్రామాలలో శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ మనుగడ సాగించాలని కోరారు. సంఘ విద్రోహక చర్యలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమి గ్రామంలో కొలువైన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం, సాయంత్రం నిత్యహోమం, బలిహరణ, రాత్రి శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. విఘ్నేశ్వరుని పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభం కాగా తెల్లవారు జామున ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. కల్యాణ మహోత్సవాలలో భాగంగా ఈ నెల 24న స్వామి వారి దివ్య రథోత్సవం జరుగుతుందని దేవాలయ కార్యనిర్వహణాధికారి ఈమని అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవాలు ఈ నెల 25 వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

కర్లపాలెం: ఎన్నికల నియమావళిని సక్రమంగా అమ లు చేయాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. మండలంలోని పెదగొల్లపాలెం పేరలిపాడు, గణపవరం గ్రామాలలో ఆయన ఈవోఆర్డీ ఎలీషాబాబుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు ఉన్నట్లయితే వెంటనే వాటిని తొలగించాలని గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏ రాజకీయ పార్టీ సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రబీ పంటలకు గిట్టుబాటు ధర ప్రకటన

వేమూరు: రబీ పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించడం జరిగిందని రేపల్లె డివిజనల్ వ్యవసాయాధికారి షేక్ అక్తర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు నియోజకవర్గంలో రబీ సీజన్‌లో సాగుచేసే జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించడం జరిగిందని చెప్పారు. మినుముకు క్వింటా రూ. 6,950లు పెసలుకు క్వింటా రూ 8,558లు, మొక్కజొన్నకు రూ.2,090లు జొన్నకు రూ.3,180లు ధర కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగు చేసిన రైతులు తమ పేర్లు రైతు భరోసా కేంద్రంలో విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ మాజీ ఆర్మీ జవాను మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మాజీ ఆర్మీ జవాను మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట రవికిరణ్ (56) ఆర్మీలో పని చేసి రిటైరయ్యారు. ఈ నెల 15న తెనాలి మార్కెట్ సెంటరులో నిలబడి ఉండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. వైద్యశాల నుంచి మంగళవారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని యేమినేనివారిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటా ప్రచారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించటమే కాకుండా అభివృద్ధిని సైతం కళ్లకు కట్టినట్లు చూపించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రచారంలో భాగంగా ఏ ఇంటికి వెళ్ళినా వైఎస్సార్ సీపీ హయాంలో తాము పొందిన సంక్షేమ లబ్ధి వివరాలను తెలుపుతూ ప్రజలు తమ ఆనందాన్ని పంచుకుంటున్నారని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కేశవతి, డాక్టర్ సృజన్, అరుంబాక గ్రామ పంచాయతీ సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ రావూరి సునీత, కొండయ్య, మిద్దె భాస్కరరావు, కేసన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్, పార్టీ నాయకులు

ఎన్నికల నియమావళి ఉల్లంఘన

పలుచోట్ల దర్శనమిస్తున్న టీడీపీ జెండాలు

కొల్లూరు : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారుల అనుమతులు లేకుండా సొంత భవనాలు, ప్రైవేటు స్థలాల్లో రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్న నిబంధనను టీడీపీ శ్రేణులు పెడచెవిని పెడుతున్నాయి. టీడీపీ నాయకులు ఎన్నికల అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలలో వారి సొంత గృహాల ముంగిట, భవనాలపైనా టీడీపీ జెండాలు ఎగురవేస్తూ ఎన్నికల కోడ్‌ను ఆపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారు. కొల్లూరు దక్షిణపు బజారులోని ఓ గృహంపై టీడీపీ జెండాతో పాటు, నారా లోకేష్ చిత్రపటంతో కూడిన యువగళం జెండా ఎగరటం స్థానికులను విస్మయానికి గురి చేస్తోంది. మండలంలోని తిప్పలకట్టలో సైతం ఇళ్ల ముంగిట, భవనాలపైనా టీడీపీ జెండాలను ఏర్పాటు చేసి టీడీపీ నాయకులు ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, జెండాలను తక్షణం తొలగించాలని పలువురు కోరుతున్నారు.



తిప్పలకట్టలో ఇంటి ముందు దర్శనమిస్తున్న టీడీపీ జెండా

ర్యాలీలు, ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

- ప్రైవేట్ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే పోస్టర్లు, జెండాలకూ అనుమతులు
- ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్

ప్రత్తిపాడు: రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచారాలకు, ర్యాలీలకు ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాల్సిందేనని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయపార్టీల నాయకులతో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ వాల్ రైటింగ్‌లకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదన్నారు. ప్రైవేట్ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఫ్లాగ్‌లు, పోస్టర్లుకు సంబంధించి కచ్చితంగా సంబంధిత ఇంటి లేదా స్థల యజమాని డిక్లరేషన్ ఇవ్వవలసి ఉంటుందన్నారు. పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేసుకోదలచిన వారు కచ్చితంగా అనుమతులు పొందాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నామినేషన్ల తేదీకి ముందు వరకు ఖర్చులను పార్టీ ఖాతాలో, ఆ తరువాత నుంచి జరిగే ఖర్చులను అభ్యర్థుల ఖాతాలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. ఆయా రాజకీయ పార్టీల నేతలు గమనించి కార్యకలాపాలను కొనసాగించాలన్నారు. అదేవిధంగా తాత్కాలిక పార్టీ కార్యకలాపాలు, ప్రచార రథాలకు, ఇతర ప్రచార వాహనాలకు కూడా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. కోడ్ ఉల్లంఘనలు, ఇతరత్రా అంశాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో 24/7 పనిచేసే విధంగా ఫిర్యాదుల సెల్ ఏర్పాటు చేశామని, నేరుగా ఫిర్యాదుల సెల్‌కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు. అలానే వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి వీల్లేదని తేల్చిచెప్పారు.



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్

ఫారం–7లు అంగీకరించం..

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఫారం–7లు ఇకపై అంగీకరించబోమని ఆర్వో చెప్పారు. 16వ తేదీన నోటిఫికేషన్ జారీకి ముందు వరకు వచ్చిన అర్జీలను మాత్రమే పరిగణలోనికి తీసుకుంటామన్నారు. అదేవిధంగా నూతనంగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునే వాటిపై ఎలాంటి పరిమితులు లేవని, ఫారం–6లు తీసుకుంటామన్నారు. కొత్తగా ఓటుకు దరఖాస్తు చేసుకునేవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంతో సుస్థిర సమాజం

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఉపయోగించుకునే విధంగా అందరిలో చైతన్యం తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, మెప్మా, సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో నూతనంగా ఓటు హక్కు పొందిన వారిని గుర్తించాలని సూచించారు. వారందరూ ఓటు వేసే విధంగా చూడాలన్నారు. ఇందుకోసం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఓటింగ్ శాతం పెరిగే విధంగా అందరూ చూడాలన్నారు. యువతలో ఓటు హక్కు పై అవగాహన తెచ్చేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటు హక్కు వజ్రాయుధమని దానిని అంతా సక్రమంగా ఉపయోగించుకుంటే మంచి పాలకులను ఎన్నుకోవచ్చని వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యం ఉందనే విషయాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అనూష మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారికి ప్రభుత్వం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. దానిని బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఓటు హక్కును యువత పొందడం దానిని ఉపయోగించడం ఎంతో ముఖ్యమని చెప్పారు. సమావేశంలో ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

డివైడర్‌ను ఢీకొన్న లారీ

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు సరుకులోడుతో వెళ్తున్న లారీ డివైడర్‌ను ఢీకొని పూర్తిగా ధ్వంసమైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. విజయవాడ నుంచి చేపలసీడ్‌తో వినుకొండ వెళ్తున్న లారీ ఫిరంగిపురంలోని బస్టాండు సమీపంలో ముందు ఉన్న చెత్త ట్రాక్టర్‌ను తప్పించబోయి డివైడర్ ఢీకొంది. ఈ ఘటనలో లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్ సుబ్బారావుకు స్వల్పగాయాలయ్యాయి.

గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

గుండవరం(చేబ్రోలు): చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో గంగానమ్మతల్లి అమ్మవారికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగానమ్మతల్లి వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు రెండు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక రథంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. విశేష కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం కొలకలూరు, దుగ్గిరాల మండలం ఈమని గ్రామాల్లో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇద్దరు వ్యక్తులు మద్యం విక్రయిస్తుండటాన్ని గుర్తించి పరిశీలించారు. ఇద్దరి వద్ద 28 సీసాలు లభించడంతో వాటిని స్వాధీన పర్చుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకూ ఒంటిపూట ప్రకటించరూ..

ప్రత్తిపాడు: ఎండలు మండుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఒంటిపూట బడులను అమలు చేయాలని కోరుతూ ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్– మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి. జ్యోతిరాణి కోరారు. ఈ మేరకు మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ వెట్రి సెల్వి, జాయింట్ డైరెక్టర్ మనోరంజనిలను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఎండలు విపరీతంగా కాస్తుండటంతో కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలంటే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, అందుచేత హాఫ్ డేస్ ప్రకటించాలని కోరారు. అదేవిధంగా మే నెల మొత్తం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు, మినీ సెంటరు వర్కర్లుకు వేసవి సెలవులు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు, జీతాలు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.